
సాక్షి
శ్రీకాకుళం
బుధవారం : 26 : ఏప్రిల్ : 2023



దిగుబడికి దన్ను

పూడిక మన్నుతో చాలా లాభాలు ఉన్నాయని వ్యవసాయాధికారులంటున్నారు. సేంద్రియ ఎరువులు వాడాలని చెబుతున్నారు. - 8లో



సేవల్లో ప్రథమం

టెక్కలి డివిజన్ పశుసంవర్ధక శాఖ ప్రతిభ చూపింది. రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. - 8లో

శ్రీకాకుళం జిల్లా ఉష్ణోగ్రతలు

మండలం	గరిష్ఠం	కనిష్ఠం
ఆమదాలవలస	35^{0}	23^{0}
ఇచ్ఛాపురం	35^{0}	23^{0}
పాతపట్నం	35^{0}	23^{0}
శ్రీకాకుళం	36^{0}	24^{0}

న్యూస్‌రీల్

రైస్ మిల్లుల తనిఖీ



వెంకటాపురంలో శివపార్వతి రైస్ మిల్లును తనిఖీ చేసిన డీఎస్‌ఓ వెంకటరమణ

కొత్తూరు: సీఎంఆర్ రైస్‌ను ప్రభుత్వానికి సకాలంలో అందజేయని రైస్ మిల్లులను సీజ్ చేస్తామని జిల్లా సివిల్ సప్లై అధికారి(డీఎస్‌ఓ) డి.వెంకటరమణ తెలిపారు. కొత్తూరు మండలంలోని శివపార్వతి, వీరాంజనేయ, వెంకట వీరాంజనేయ రైస్ మిల్లులను మంగళవారం డీఎస్‌ఓ తనిఖీ చేశారు. ఇంత వరకు సీఎంఆర్ రైస్ చెల్లించని రైస్ మిల్లులు ఇక నుంచి సింగన్నపాలెం ఎఫ్‌సీఐ గోదాంలకు తరలించాలని ఆదేశించారు. ఈ ఖరీఫ్‌లో జిల్లాలోని 274 రైస్ మిల్లులకు 6 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం సీఎంఆర్ పద్ధతిలో సరఫరా చేసినట్లు చెప్పారు. ఇంత వరకు సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లింగ్ చేసి పీడీఎస్ కోసం బియ్యం సరఫరా చేసినట్లు తెలిపారు. మిల్లర్ల నుంచి బియ్యం రావాల్సి ఉందని, వాటిని ఎఫ్‌సీఐకి పంపిస్తామని చెప్పారు. డీఎస్‌ఓతో పాటు కొత్తూరు మండలం సివిల్ సప్లై ఉప తహసీల్దార్ రవి ఉన్నారు.

7.6 కిలోల గంజాయితో నలుగురు అరెస్ట్



గంజాయి తరలిస్తున్న వ్యక్తులను పట్టుకున్న పోలీసులు

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని మూడు రోడ్ల కూడలిలో గంజాయి తరలిస్తున్న నలుగురు వ్యక్తులను మంగళవారం మెళియాపుట్టి పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్ఐ టి.రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం పోలీసులు విధి నిర్వహణలో భాగంగా మూడు రోడ్ల కూడలిలో ఉన్న సమయంలో ఓ వ్యక్తి బ్యాగుతో అనుమానాస్పదంగా తిరిగాడు. అతని వద్దకు వెళ్లి బ్యాగును పరిశీలించగా గంజాయి దొరికింది. అతడిని ఒడిశా గజపతి జిల్లా, చెడిపడా గ్రామానికి చెందిన బాలు మాలిక్‌గా గుర్తించారు. మొత్తం 7.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని విచారించగా అతనితోపాటు వచ్చిన మరో ముగ్గురు వ్యక్తులు(సంజీవ్ బ్యూరో, ఏలియా రైక, ఓసియా రైక) వేర్వేరు చోట్ల ఉన్నట్లు తెలిపాడు. వారిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. వీరు గంజాయితో పలాస రైల్వేస్టేషన్‌కు వెళ్తున్నట్లు వెల్లడించారు. అక్కడి నుంచి హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, కోల్‌కతా వంటి ఇతర ప్రదేశాలకు రవాణా చేస్తున్నట్లు చెప్పాడు.

డిగ్రీ స్పెషలైజేషన్‌పై ప్రత్యేక కసరత్తు

ఎచ్చెర్ల క్యాంపస్: నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ కోర్సుల్లో స్పెషలైజేషన్ సబ్జెక్టులపై ప్రత్యేక కసరత్తు అవసరమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. ఉన్నత విద్యా మండలి మంగళవారం నిర్వహించిన వర్చువల్ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యా రంగంలో మార్పులు, నూతన విద్యా విధానం అమలు కీలకమని చెప్పారు. విద్యా రంగంలో సమూల మార్పులు వస్తాయని, ఉన్నత విద్యలో నాలుగేళ్ల డిగ్రీ కోర్సులు ప్రారంభిస్తామని అన్నారు. స్పెషలైజేషన్ సబ్జెక్టు అమల్లో ఉద్యోగ, ఉపాధికి ప్రాధాన్యత అవసరమని చెప్పారు. స్పెషలైజేషన్‌లో ఒకే సబ్జెక్టు ఉండటం వల్ల సబ్జెక్టుపై పూర్తిస్థాయి పట్టు వస్తుందన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, పరీక్షల డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

వ్యర్థాల వినియోగంలో శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో వ్యర్థాలు, చెత్త సేకరించే వారికి వ్యర్థాల వినియోగంలో శిక్షణ ఇచ్చేందుకు ఒక రోజు ఓరియెంటేషన్ కార్యక్రమాన్ని జిల్లా షెడ్యూల్డ్ కులాల సేవా సహకార సంస్థ ద్వారా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ఈడీ కె.రామారావు ఓ ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం బాపూజీ కళా మందిర్‌లో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడ ఎంపికైన వారికి విజయవాడలో ఉన్న సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్, ఇంజినీరింగ్ టెక్నాలజీ విజయవాడ శిక్షణ సంస్థ ద్వారా శిక్షణ అందిస్తామన్నారు. చెత్త సేకరణ వృత్తిలో ఉన్న వారు ఆధార్ కార్డు, పాస్‌పోర్టు ఫొటో, సంబంధిత విద్యార్హతల జిరాక్సులతో తేదీ 26 బుధవారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని సూచించారు.

ఎందుకళా బొంకుతారు?





కళా వెంకటరావు 'సెల్ఫీ' గోల్

- వైఎస్సార్ నిర్మించిన భవనాన్ని చూపించి ట్రిపుల్ ఐటీ ఘనత తమదంటూ డప్పు కొట్టిన కళా
- వైఎస్సార్ నిర్మించిన 21వ శతాబ్దం గురుకులంలో ఒక్క బ్యాచ్‌తో ప్రారంభించిన టీడీపీ ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక దాదాపు రూ. 200కోట్లతో ఆధునికీకరణ
- కళా వెంకటరావు సెల్ఫీ చాలెంజ్ చూసి నవ్వుకుంటున్న జనం
- పార్టీ పరువు మంట గలిపారంటున్న టీడీపీ శ్రేణులు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : ఎచ్చెర్ల మండలం ఎస్ఎం పురంలో ఉన్న ట్రిపుల్ ఐటీ భవనాన్ని చూపిస్తూ టీడీపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకటరావు సెల్ఫీ సవాల్ విసిరారు. కానీ ఆ భవనాన్ని టీడీపీ హయాంలో నిర్మించలేదు. దీంతో ఆయన అభాసుపాలయ్యారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 21వ శతాబ్దపు గురుకులం కోసం రూ.18 కోట్లతో తొమ్మిది బ్లాక్‌ల భవనాన్ని నిర్మించారు. నిర్మాణంలో ఉండగానే వైఎస్సార్ మరణంతో ఆయన తర్వాత ముఖ్యమంత్రిగా వచ్చిన కొణిజేటి రోశయ్య ప్రారంభించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ట్రిపుల్ ఐటీని ఇక్కడ ఏర్పాటు చేశారు. కొత్తగా భవనం నిర్మించకుండా వైఎస్సార్ నిర్మించిన భవనంలో ప్రారంభించారు. ఇక ట్రిపుల్ ఐటీ తమ గొప్పతనంగా టీడీపీ చెప్పుకుంటోంది. ట్రిపుల్ ఐటీ అనగానే గుర్తుకొచ్చేది దివంగత ముఖ్యమంత్రి వైఎస్సారే. ఆయన కలల విద్యా సంస్థ ట్రిపుల్ ఐటీ. ఆయన హయాంలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేశారు. అందులో శ్రీకాకుళంలో కూడా ఏర్పాటు చేయాలని భావించారు. ఈ లోపు ఆయన మరణించడంతో ముందుకు సాగలేదు. టీడీపీ వచ్చాక ట్రిపుల్ ఐటీని వైఎస్సార్ నిర్మించిన భవనంలో ప్రారంభించింది. అది కూడా ఒక బ్యాచ్‌నే నడిపింది. దాంట్లో కూడా వైఎస్సార్ నిర్మించిన భవనంలో 500మంది బాలికలతో, అద్దెకు తీసుకున్న మిత్రా ప్రైవేటు కళాశాలలో 500మంది బాలురుతో నడిపింది. వారి హయాంలో కొత్తగా ఒక్క భవనం కూడా నిర్మించలేదు. ఇవన్నీ మర్చిపోయి కళా ఇక్కడ సెల్ఫీ దిగడంతో ప్రజలే కాదు టీడీపీ నాయకులు, కార్యకర్తలు కూడా నవ్వుకుంటున్నారు.

అన్నీ బొంకులే

దాదాపు రూ.100 కోట్లతో టీడీపీ హయాంలో నిరుపేద విద్యార్థుల కోసం ఉన్నత విద్య అందించడమే లక్ష్యంగా ట్రిపుల్ ఐటీని తీసుకువచ్చామని కళా అవాస్తవాలను పోస్టు చేశారు. అయితే ఇక్కడే కళా పప్పులో కాలేశారు. టీడీపీ హయాంలో కేవలం రూ.43 కోట్లు మాత్రమే మంజూరు చేశారు. వారి హయాంలో భవన నిర్మాణం చేపట్టలేకపోయారు. అరకొర నిర్మాణాలు చేపట్టి గాలికొదిలేశారు. దీంతో టీడీపీ పాలన సాగిన 2017లో కేవలం ఒక బ్యాచ్‌ను మాత్రమే నడపగలిగారు. పీయూసీ 1 బ్యాచ్‌ను వెయ్యి మంది(500బాలికలు, 500బాలురు)తో ప్రారంభించారు. తర్వాత సంవత్సరం చేరే బ్యాచ్‌కు భవనాల్లేక నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఇక్కడి విద్యార్థులను పంపించారు. ట్రిపుల్ ఐటీలో పీయూసీ 1, పీయూసీ 2, ఇంజినీరింగ్ 1, ఇంజినీరింగ్ 2, ఇంజినీరింగ్ 3, ఇంజినీరింగ్ 4 తరగతులుంటాయి. టీడీపీ హయాంలో కేవలం పీయూసీ 1 బ్యాచ్‌ను ప్రారంభించి, ఆ తర్వాత భవనాలు సమకూర్చలేక చేతులెత్తేసి తర్వాత సంవత్సరం పీయూసీ 1లో చేరే విద్యార్థులను నూజివీడుకు తరలించారు.

కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అరకొరగా జరిగిన నిర్మాణాలను పూర్తి చేశారు. దాదాపు 4వేల మంది విద్యార్థులకు సరిపడా జీప్లస్ 5 భవనాన్ని రూ. 131కోట్లతో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించింది. దీంతో నాలుగు బ్యాచ్‌ల(పీయూసీ 1, పీయూసీ2, ఇంజినీరింగ్1, ఇంజినీరింగ్2)ను నడుపుతోంది. అంతటితో ఆగలేదు. 2024 నాటికి ఆరేళ్ల ఇంజినీరింగ్ కోర్సును విద్యార్థులు ఇక్కడే పూర్తి చేసేలా లక్ష్యం పెట్టుకుని రూ. 67కోట్లతో న్యూ అకాడమీ బ్లాక్‌ను ప్రస్తుతం నిర్మిస్తోంది. ఇది కాకుండా దాదాపు 6,600మందికి సరిపడా వసతి సౌకర్యాలను కల్పించేందుకు రూ.133కోట్లతో నిర్మాణాలు చేపట్టేందుకు ఇటీవల బడ్జెట్‌లో నిధుల కేటాయింపు కూడా చేసింది.

అభాసుపాలు

వాస్తవాలన్నీ వదిలేసి ట్రిపుల్ ఐటీ ఏర్పాటు ఘనత మాదే అంటూ కళా ప్రభుత్వానికి సవాల్ విసిరారు. అయితే నిజం తెలిసిన ప్రజలు కళా సెల్ఫీ చూసి అవాక్కయ్యారు. జిల్లా టీడీపీ శ్రేణులు సైతం కళా వేషాలు చూసి నవ్వుకుంటున్నారు. అనవసర సెల్ఫీ చాలెంజ్‌లతో అభాసుపాలవుతున్నామని బాధపడుతున్నారు. రిమ్స్, బీఆర్ఏయూ, వంశధార ప్రాజెక్టు, నాడు-నేడు స్కూళ్లు, ఆర్‌బీకేలు, ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు, కిడ్నీ రీసెర్చ్ సెంటర్ వంటి పనులు ఏమైనా టీడీపీ చేపట్టి ఉంటే చెప్పుకోవాలి గానీ ఇలా తమవి కాని భవనాల వద్ద సెల్ఫీలు దిగి రాజకీయాలు చేయడం సరికాదని జనమంటున్నారు.

గృహ నిర్మాణ ఇంజినీర్లపై కలెక్టర్ ఆగ్రహం



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న కాలనీల్లో ఆర్బీల ఎలాట్‌మెంట్ రెండు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లతో గృహ నిర్మాణాలు, జగనన్న కాలనీల్లో ఆర్బీల నిర్మాణాలు, 65వ సీఎస్ఎంసీ, తదితర అంశాలపై సమీక్షించారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గృహ నిర్మాణాలు పూర్తి కాకపోవడంపై డీఈ, ఏఈలకు షోకాజ్ నోటీసులు జారీ చేస్తూ బదిలీలకు చర్యలు తీసుకోవాలని పీడీని ఆదేశించారు. నిధులు అందుబాటులో ఉన్నా ఆర్బీలు అలాట్ చేయకపోవడం సరికాదన్నారు. రెండు రోజుల్లో ఏజెన్సీలకు అలాట్‌మెంట్ చేయకపోతే పీడీపైనా చర్యలు తప్పవన్నారు. మే 10 నాటికి 3959 గృహాలు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో గృహ నిర్మాణ శాఖ పీడీ గణపతిరావు పాల్గొన్నారు.

కౌన్సెలింగ్‌కు గైర్హాజరైన వారికి మరో అవకాశం

శ్రీకాకుళం న్యూకాలనీ: 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ప్రభుత్వం బంపర్ ఆఫర్ ఇచ్చింది. 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అయి, డీఈఓ వెబ్‌పోర్టల్ జాబితాలో పేరు ఉండి, ఈనెల 12వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించిన కౌన్సెలింగ్, నియామక ప్రక్రియకు హాజరుకాలేకపోయిన అభ్యర్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. వారికి ఈనెల 27వ తేదీన కౌన్సెలింగ్‌తోపాటు నియామక ప్రక్రియను కూడా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇలా కౌన్సెలింగ్‌కు రాని వారు జిల్లాలో 19 మంది ఉన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటల నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియను నిర్వహించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ప్రభుత్వం కల్పించిన సువర్ణ అవకాశాన్ని (గైర్హాజరైన) అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య తెలిపారు. అభ్యర్థులు వారి హాల్‌టిక్కెట్‌తోపాటు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, 2 పాస్ ఫొటోలతో హాజరుకావాల్సి ఉంటుందని డీఈఓ సూచించారు.

చివరి చూపైనా దక్కలేదు



బొంతల సురేష్

నరసన్నపేట: భార్య కన్నవారింటికి వెళ్లింది. భర్త వద్ద ఫోన్ లేకపోవడంతో అతని సమాచారం భార్యకు తెలిసే వీలు లేదు. ఆమె పుట్టినింటి నుంచి తిరిగి వచ్చేసరికి భర్త కనిపించలేదు. ఏమైందా అని ఆరా తీస్తే రోడ్డు ప్రమాదంలో అతను చనిపోయిన దిగ్భ్రాంతికర విషయం తెలిసింది. కమ్యూనికేషన్ లేకపోవడం వల్ల భర్త ఆఖరి చూపు కూడా ఆమెకు దక్కలేదు. తలసముద్రం గ్రామంలో జరిగిన ఈ ఘటన స్థానికులను కంటతడి పెట్టించింది.

మండలంలోని దేవాది వద్ద ఈ నెల 15వ తేదీ రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఆ ప్రమాదంలో తలసముద్రం గ్రామానికి చెందిన బొంతల సురేష్ (36) అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యారు. అయితే ప్రమాదం జరిగాక మృతుడి వివరాలు పోలీసులకు తెలియకపోవడంతో మూడు రోజులు వేచి చూసి వారే ఖననం చేశారు. ఈ ప్రమాదం జరగడానికి రెండు రోజుల ముందు సురేష్ భర్త శివమోహిని పుట్టినింటికి వెళ్లారు. సురేష్ వద్ద ఫోన్ లేకపోవడం, మృతుడి వివరాలు పోలీసులకు కూడా తెలియకపోవడంతో భర్త చనిపోయిన సంగతి ఆమెకు తెలియలేదు. కన్నవారింటిలో పనులు ముగించుకుని ఆమె సోమవారం తలసముద్రం వచ్చారు. కానీ ఇంటిలో భర్త కనిపించలేదు. ఎక్కడకు వెళ్లి ఉంటాడా అని ఆరా తీస్తే దేవాది వద్ద జరిగిన ప్రమాదం జరిగిన విషయం తెలిసింది. ఆ ఫొటోలు పరిశీలిస్తే అక్కడ చనిపోయినది ఆమె భర్త సురేష్ అనే విషయం అర్థమైంది. దీంతో వెంటనే ఆమె పోలీసులను ఆశ్రయించి వివరాలు అందించారు. దీనిపై ఎస్ఐ వై. సింహాచలం మాట్లాడుతూ ఆధారాలు సేకరించి మృతి చెందిన వ్యక్తిని నిర్ధారిస్తామని అన్నారు. అయితే మృతదేహాన్ని ఖననం చేయడంతో ఆమెకు చివరి చూపు కూడా దక్కలేదు.

ఆటో, కారు ఢీ: 10 మందికి గాయాలు



ప్రమాదంలో గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తున్న 108 వాహనం

నందిగాం: మండలంలోని దేవుపురం పంచాయతీ తురకలకోట సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం టెక్కలి నుంచి పలాస వెళ్తున్న ఆటోను అదే మార్గాన వస్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఆరుగురు, కారులో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. నందిగాం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పలాస మండలం సూదికొండకు చెందిన ఐదుగురు కోటబొమ్మాళి మండలం బంజీరుపేటలో జరుగుతున్న గ్రామదేవత సంబరాలకు ఆటో బుక్ చేసుకుని వెళ్లారు. అక్కడ కార్యక్రమాలు ముగించుకుని తిరిగి సూదికొండకు వస్తుండగా నందిగాం మండలం తురకలకోట సమీపానికి వచ్చే సరికి కారు వెనుక నుంచి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న వారంతా గాయపడ్డారు. వీరిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. కారులో ఉన్న వారు కూడా గాయపడడంతో వీరికి పలాస ఆస్పత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ మిన్నారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెచ్‌సీ రవికుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు'



పూర్ణాటకంలో సరిహద్దు రాళ్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నవీన్

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూ సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ హెచ్చరించారు. ఆయన మంగళవారం మండలంలోని 8 గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర సర్వే పనులను పరిశీలించారు. పూర్ణాటకం గ్రామం వద్ద సమగ్ర భూసర్వేలో భాగంగా చేపట్టాల్సిన స్టోన్ ప్లాంటేషన్ చేయకపోవడంపై మండల సర్వేయర్ తవిటయ్యతో పాటు విలేజ్ సర్వేయర్లు, సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. రైతుల మధ్య వివాదాలకు తావివ్వకుండా స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటి వరకు మండలంలోని 8 గ్రామాల్లో రీసర్వే పూర్తిచేయగా 88 శాతం మేరకు స్టోన్ ప్లాంటేషన్ కూడా జరిగినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ గురుప్రసాద్, డీటీ శ్రీహరి, ఆర్ఐ శ్రవణ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే 'పల్లె నిద్ర'



పల్లెనిద్రలో వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు

గార: ప్రజా సమస్యలు తెలుసుకోవడం కోసం గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు అన్నారు. ఆయన మంగళవారం శ్రీకూర్మం పంచాయతీ గోరువానిపేటలో పల్లెనిద్ర నిర్వహించారు. సాయంత్రం నుంచి ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీవారు. దీపావళి గ్రామానికి చెందిన లబ్ధిదారు ఇంటి సమస్యపై చర్యలు తీసుకుంటానని తెలిపారు. అర్హులైన వారందరికీ పథకాలు అందుతున్నాయని చెప్పారు. గోరువానిపేట గ్రామం స్వచ్ఛతకు నిదర్శనమని, ఇక్కడ అందరూ సామరస్యంగా ఉండటం, ఆధ్యాత్మిక వాతావరణంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోరు అనిత, ఏఎంసీ మాజీ చైర్మన్ బరాటం నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీలు అరవల రామకృష్ణ, బాలకృష్ణమూర్తి, ఊట అప్పలనాయుడు, బరాటం నాగరాజు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, పీస గోపి, మార్పు పృథ్వీరాజ్, టి.అప్పలరాజు, సుంకాన సురేష్, గంగు రామారావు పాల్గొన్నారు.

టిడ్కో కల.. నెరవేరే వేళ

- 29న తొలివిడతగా 1280 ఇళ్ల అందజేత
- 1904 ఇళ్లకు గాను తొలివిడతగా 1280 ఇళ్లు సిద్ధం
- సీఎం వైఎస్ జగన్ చొరవతో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి



పూర్తయిన టిడ్కో ఇళ్లు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): జిల్లా వాసుల టిడ్కో ఇళ్ల కల నెరవేరనుంది. అన్ని రకాల సౌకర్యాలు కల్పించి ఈ నెల 29న లబ్ధిదారులకు తొలి విడతగా 1280 మందికి జిల్లా కేంద్రంలో టిడ్కో ఇళ్లను అందించనున్నారు. రెండో విడత కింద మరో 624 ఇళ్లను అందించేందుకు అధికార యంత్రాంగం పనులు చేస్తున్నారు.

టీడీపీ హయాంలో హామీలే..

2019 ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు పేదల ఓట్లు కొట్టేసే ప్రయత్నంలో భాగంగా టిడ్కో ఇళ్లు ఇస్తానని చెప్పి ఆ హామీని గాలికొదిలేశారు. ఉచితంగా అని ఓ సారి, డబ్బులు కట్టాలని మరోసారి ప్రకటించి జనాలను అయోమయానికి గురిచేశారు. అప్పట్లో ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్క రూపాయి కడితే చాలు టిడ్కో ఇళ్లు నిర్మాణం చేసి ఇస్తాం అని చెప్పారు. చెప్పిన మాట ప్రకారం అన్ని రకాల సౌకర్యాలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో కార్పొరేట్ స్థాయిలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. ఆ ఇళ్లనే ఈ నెల 29న లబ్ధిదారులకు అందించనున్నారు.

29న ఇవ్వనున్నాం

అన్ని రకాల మౌలిక సౌకర్యాలతో టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు ఈ నెల 29న అందించనున్నాం. మొదటి విడతలో 1280 ఇళ్లు అందిస్తాం. రెండో విడత మరికొద్ది రోజుల్లో ఇచ్చేందుకు చర్యలు చేపడుతున్నాం. మొత్తం మూడు కేటగిరీల్లో 1904 ఇళ్లను పూర్తిచేశాం.

– చల్లా ఓబులేసు, కమిషనర్, శ్రీకాకుళం కార్పొరేషన్

ఇళ్ల పంపిణీ ఇలా..

ఫేజ్–1లో 1280కి గాను	
కేటగిరి–ఎ కింద 300 చదరపు అడుగుల ఇళ్లు	480
కేటగిరి–బి కింద 365 చదరపు అడుగులు ఇళ్లు	192
కేటగిరి–సి కింద 430 చదరపు అడుగుల ఇళ్లు	608
ఫేజ్–2లో 624 (300 చదరపు అడుగులు) ఇళ్లు ఇవ్వనున్నారు.	

వెచ్చించిన మొత్తం

ఇళ్ల నిర్మాణానికి	రూ.87కోట్లు
రోడ్లు తాగునీటి సదుపాయాలకు	రూ.15.50కోట్లు
మురుగునీరు శుద్ధిచేసే ప్లాంట్‌కు..	రూ.5.38కోట్లు
విద్యుత్, మొక్కల ఏర్పాటుకు	రూ.కోటి

కొత్తూరులో భారీ వర్షం

కొత్తూరు: కొత్తూరు మండలంలో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో రోడ్లన్నీ వర్షం నీటితో మునిగిపోయాయి. ఈదురు గాలుల కారణంగా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. మామిడి, జీడిమామిడి, మొక్క జొన్న పంటలు దెబ్బ తిన్నాయి.



కొత్తూరులో కురిసిన భారీ వర్షం

'నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం'



ఆఫ్‌షోర్ నిర్వాసితులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

మెళియాపుట్టి: మండలంలోని ఆఫ్‌షోర్ నిర్వాసితుల సమస్యలు తప్పనిసరిగా పరిష్కరిస్తామని అధైర్యపడవద్దని టెక్కలి సబ్‌కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం రేగులపాడు గ్రామంలో చీపురుపల్లి గ్రామానికి చెందిన ఆఫ్‌షోర్ నిర్వాసితులతో సమావేశమయ్యారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీలు పలువురికి రాలేదని, కొంతమందికి పట్టాలు ఇచ్చి స్థలాలు చూపించలేదని నిర్వాసితులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అదేవిధంగా డి-పట్టాలకు సంబంధించి కొంతమందికి డబ్బులు జమ కావాల్సి ఉందని తెలిపారు. ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని, సర్వం కోల్పోయిన మమ్మల్ని ఆదుకోవాలని కోరారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని వేల ఎకరాల్లో పంటలు పండాలనే ఆలోచనతో ప్రాజెక్ట్ నిర్మాణం చేపడుతున్న నేపథ్యంలో సమస్యలు రావడం పరిపాటేనని, అయితే అన్నింటినీ అధిగమించి ప్రాజెక్ట్ పూర్తిచేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. తన పరిధిలోని సమస్యలు పరిష్కరిస్తానని, మిగిలినవి కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. రేగులపాడు నుంచి పెద్దమడి గ్రామం వరకు డైవర్షన్ రహదారి నిర్మాణానికి నిర్వాసితుల సహకారం అవసరమని అన్నారు. ఆయనతో పాటుగా తహసీల్దార్ పి.సరోజిని తదితర అధికారులు పాల్గొన్నారు.

దొంగ దొరికాడు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో సోమవారం రాత్రి 7.30 గంటలకు న్యూకాలనీలో జరిగిన దొంగతనం కేసును కాశీబుగ్గ పోలీసులు ఛేదించారు. సత్తుగణ సింగ్ చాట్ బండి వ్యాపారి ఇంటిలో దొంగతనం చేసిన వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తుండడంతో పోలీసులు పట్టుకున్నారు. అదుపులోకి తీసుకుని వివరాలు రాబట్టగా ఒడిశా రాష్ట్రం ఖరడపల్లి గ్రామానికి చెందిన బజానాయక్‌గా గుర్తించి కేసు నమోదు చేశారు. ముద్దాయి నుంచి సుమారు రూ.80 వేలు విలువ చేసే తులంనర బంగారు వస్తువులు, రూ.9580 నగదు స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

ఆదిత్యుని సన్నిధిలో ఆప్కో చైర్మన్



చిరంజీవికి జ్ఞాపిక అందజేస్తున్న రంజిత్ శర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది బి.ఎస్.చక్రవర్తి, ఆప్కో సిబ్బంది పాల్గొన్నారు.

జస్టిస్ యతిరాజులుకు ప్రతిష్టాత్మక అవార్డు



జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు

శ్రీకాకుళం కల్చరల్: ఏపీ హైకోర్టు మాజీ జడ్జి, నారాయణ తిరుమల అనువంశిక ధర్మకర్త పి.ఎన్.కాలనీకి చెందిన జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు డాక్టర్ నీలం సంజీవ రెడ్డి న్యాయ శిరోమణి అవార్డు–2023కు ఎంపికయ్యారు. ఈ మేరకు డాక్టర్ నీలం సంజీవరెడ్డి మెమోరియల్ లెక్చర్, భారత గ్రామీణ అధ్యయనం, పరిశోధన అకాడమీ(అగ్రశ్రీ) సంస్థ మంగళవారం ప్రకటన విడుదల చేసింది. మే 19న తిరుపతిలో ఈ అవార్డు అందచేయనున్నట్లు పేర్కొంది.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఏపీజేఏసీ అమరావతి మలి దశ ఉద్యమ కార్యాచరణలో భాగంగా మంగళవారం ఉద్యోగులు నల్ల రిబ్బనులతో నిరసన వ్యక్తం చేశారు. నగరంలోని అంబేడ్కర్ జంక్షన్ సమీపంలోని రెవెన్యూ గెస్ట్ హౌస్ వద్ద కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ధర్నా చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు.

వ్యవసాయ పరిశోధనలు పెరగాలి



మాట్లాడుతున్న వ్యవసాయ విస్తరణ సంచాలకుడు సుబ్బిరామిరెడ్డి

శ్రీకాకుళం రూరల్: ఉత్తర కోస్తా జిల్లాల సంబంధించిన వ్యవసాయ ఉత్పత్తులపై పరిశోధనలు పెరగాలని ఆచార్య ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం(గుంటూరు) పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి అన్నారు. జిల్లా కేంద్రంలో జరుగుతున్న ఉత్తర కోస్తా మండల వ్యవసాయ విస్తరణ సమావేశాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న తొలకరిలో అధునాతన రకాలు ఎంటీయూ–1239, ఎంటీయూ–1318లతో పాటు నేరుగా విత్తే వరి విధానంలో యంత్రాల లభ్యత, ఫెర్టికం సీడ్రిల్‌లు నాలుగు జిల్లాల్లో పెరగాలన్నారు. పుష్పజాతి పంటల్లో కొత్త రకాలు తీసుకురావాలన్నారు. విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎ.సుబ్బిరామిరెడ్డి మాట్లాడుతూ మొక్కజొన్నలో డీఏపీ, యూరియా కలిపిన ద్రావణాన్ని మొదల్లో పోయాలన్నారు. అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ బి.వి.కె.జగన్నాథరావు మాట్లాడుతూ ఉత్పత్తి, దిగుబడులకు రైతులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,710–00
బంగారం(22సి. 10గ్రా.)	55,650–00
వెండి (కిలో)	80,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 450.00
విజయనగరం	రూ. 454.00
శ్రీకాకుళం	రూ. 454.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹117	₹204	₹ 214

పూడిక మన్ను..

దిగుబడికి దన్ను



కొబ్బరి తోటల్లో ఆవుపేడతో కలిపిన ఒండ్రు మట్టి

- సేంద్రియ ఎరువులతో భూమి సారవంతం
- తక్కువ ఖర్చుతో అధిక లాభం
- ఆసక్తి చూపుతున్న రైతులు

ఇచ్ఛాపురం రూరల్ : పంటలు సమృద్ధి పండాలంటే భూమి సారవంతంగా ఉండాలి. అయితే కొన్నాళ్లుగా రసాయన ఎరువులను అధిక మోతాదులో వినియోగించడం వల్ల చాలాచోట్ల భూమి సారవంతాన్ని కోల్పోయింది. ఫలితంగా తెగుళ్ల సోకడంతో దిగుబడి రాక అన్నదాత అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ ఆలోచన చేస్తున్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలతో ఎక్కువగా సేంద్రియ ఎరువుల వైపు మొగ్గు చూపుతున్నారు. పొలాల్లో భూసారాన్ని పెంపొందించేందుకు పశువుల పేడ, పూడిక మట్టిని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం దూరాన్ని బట్టి ట్రాక్టర్ ఎరువు రూ.1800 నుంచి రూ.2,300 వరకు ధర పలుకుతోంది. ఖరీఫ్ సీజన్‌లో రెండున్నర ఎకరాల పంట పొలాల్లో ఎకరాకు 4–5 టన్నుల వరకు సేంద్రియ ఎరువులను రైతులు వినియోగిస్తున్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో ఒకే రకమైన పంటలను వేస్తుంటారు. ప్రతి సారీ పంటల మార్పిడితో పాటు నల్ల మట్టిని వేయడం వల్ల భూమిలో సారం పెరిగి చీడ పురుగుల బారినుంచి రైతులు పంటలను కాపాడుకోవచ్చు. పూడిక మట్టిని పంట పొలాల్లో వేయడం వల్ల భూమిలో బంకమట్టి శాతం పెరుగుతోంది. దీంతో నీటిని, పోషక పదార్థాలను నిలుపుకునే శక్తి అధికమవుతోంది.

పర్యావరణం దెబ్బతినకుండా..

పంటల దిగుబడులకు ఒండ్రుమట్టి సంజీవనిలా పనిచేస్తుంది. చెరువులు, కుంటల్లోని నల్లటి ఒండ్రు మట్టి పోషక విలువలు కలిగి ఉండడం వల్ల రైతులకు పెట్టుబడి వ్యయాన్ని తగ్గిస్తుంది. సేంద్రియ ఎరువుల ఉపయోగంతో పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుందని వ్యవసాయ, ఉద్యానవన అధికారులు చెబుతున్నారు. రైతులు ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువులు, కుంటల్లోని మట్టిని ఉచితంగా తరలించుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. కేవలం పంట పొలాల్లోకే కాకుండా కొబ్బరి తోటల్లో పూడిక తీత మట్టిని, సేంద్రియ ఎరువులను వాడటం వల్ల ఆరోగ్యకరమైన వ్యవసాయ ఉత్పత్తులు సాధించేందుకు దోహదపడుతుంది. వ్యవసాయ, కొబ్బరి తోటల్లో భూసారం పెంచుకునేందుకు నల్ల మట్టిని పంట పొలాల్లో వేయడం ద్వారా పంటల దిగుబడి అధికంగా పొందవచ్చు. దీంతో భూసారం కూడా పెరుగుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వీటి వాడకం వల్ల ముఖ్యంగా కొబ్బరి తోటల్లో నీటి శాతం నిల్వ, వానపాముల సంపద పెరిగే అవకాశాలు అధికంగా ఉండటంతో ఉద్దానం రైతులు కొబ్బరి తోటల్లో విరివిగా ఉపయోగిస్తున్నారు.

సారవంతం



చెరువు మట్టి, సేంద్రియ ఎరువులతో భూమిలో సారం పెరిగి చీడపురుగుల బారి నుంచి రైతులు పంటలను కాపాడుకోవచ్చు. వర్షాలకు ముందే మట్టిని వేసుకుని కలియదున్నితే భూముల్లో చెరువు మట్టి కలిసిపోతుంది. దీనితో పాటు పశువుల పేడ, వేప నూనె వేసుకోవడం వల్ల అవి భూముల్లో కుళ్లిపోయి నేలసారవంతంగా మారుతుంది.

– పిరియా శ్రీదేవి, వ్యవసాయాధికారి, ఇచ్ఛాపురం మండలం

అండర్–23 పురుషుల క్రికెట్ జట్టు ఖరారు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా అండర్–23 పురుషుల క్రికెట్ జట్టు ఖరారైంది. 17 మంది క్రీడాకారులతో కూడిన జిల్లా జట్టు జాబితానుజిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి ముస్తాక్ మహ్మద్ మంగళవారం వెల్లడించారు. ఈ నెల 26 నుంచి విజయనగరం వేదికగా జరిగే ఏసీఏ అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో జిల్లా జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందని పేర్కొన్నారు. 45 మంది ప్రాబబుల్స్ జట్టుకు సెలక్షన్ మ్యాచ్‌లు నిర్వహించిన తర్వాత సెలక్టర్లు ఎంపిక చేసిన మేరకు తుది జాబితా ప్రకటించినట్టు ముస్తాక్ చెప్పారు.

జిల్లా జట్టు : టి.విజయ్, డీవీఎస్ శ్రీరాం, డి.కులశేఖర్, ఎం.పూర్ణచంద్ర, ఎస్.సుశాంత్, ఎం.సూర్యకిరణ్, మీర్ హైదర్, కె.గణేష్, ఎస్‌డీఎస్‌వీ ప్రసాద్, జి.లవన్, కార్తికేయ, ప్రద్నీష్‌సాయి, ఎం.సాయియశ్వంత్, ఎస్.దినేష్‌చంద్ర, ఎం.మనోజ్, పి.సతీష్, ఎం.రోహిత్. స్టాండ్‌బైగా ఎన్ని జ్ఞానతేజ, జి.కళ్యాణ్, సిద్ధూ విజ్ఞాష్, ఎ.అప్పన్న, సయీర్.

ప్రజల నాడికి దర్పణం పీపుల్స్ మెగా సర్వే



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురంరూరల్: రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన మెగా పీపుల్స్ సర్వేలో కోటి కుటుంబాలలో రికార్డు స్థాయిలో 79 లక్షల ఫోన్‌కాల్స్ రిజిస్టర్ కావడం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల ప్రజల స్పందనను తెలియజేస్తుందని శ్రీకాకుళం జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. కొఠారిలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటి వరకు 90256 కుటుంబాల్ని కలిసి 95 శాతం సర్వే పూర్తిచేశామన్నారు. నవరత్నాల పథకాలను శతశాతం అమలుచేసిన సీఎం జగన్ పాలనలో కొత్త ఒరవడి సృష్టించారన్నారు. కార్యక్రమంలో రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరెడ్డి, ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, కంచిలి ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, కారంగి మోహనరావు, ఉప్పాడ రాజారెడ్డి, సర్పంచ్ దుక్క ధనలక్ష్మి, పిట్ట విశ్వనాథం, దక్కత నూకయ్య, రాంపత్ని చిట్టిబాబు, పిట్ట మామయ్య, నీలాపు జగదీష్, సారథి, తులసిరాం, చక్రవర్తి, బతకల మోహనరావు, యాదవరెడ్డి, నర్తు వరప్రసాద్, ఇసురు యాదవరెడ్డి పాల్గొన్నారు.

గంగానది పుష్కరాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు



గంగానది పుష్కరాలు బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీకాకుళం ఆర్టీసీ ఒకటి, రెండు డిపోల మేనేజర్‌లు మాధవ్, శర్మ, సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: గంగా నది పుష్కరాలకు వెళ్లే భక్తుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు నడుపుతున్నామని, వీటిని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డీపీటీఓ ఎ.విజయ్‌కుమార్, ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్‌లు కె.మాధవ్, కేఎస్ఆర్ శర్మలు కోరారు. ఈ మేరకు గంగానది పుష్కరాలకు సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం శ్రీకాకుళంలోని ఆర్టీసీ 2వ డిపో కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ పుష్కరాలు ఏప్రిల్ 22న ప్రారంభమై మే 3తో ముగుస్తాయని అన్నారు. ఇప్పటికే ఈనెల 23న శ్రీకాకుళం నుంచి వారణాశికి ఒక బస్సు వెళ్లిందని, అలాగే ఈనెల 27వ తేదీన శ్రీకాకుళం రెండో డిపో నుంచి మరో బస్సు వారణాసి వెళ్లనుందని తెలిపారు. అదే విధంగా ఈనెల 30వ తేదీన మరో సూపర్‌లగ్జరీ బస్సు శ్రీకాకుళం జిల్లా కేంద్రం నుంచి బయలుదేరి వెళ్లనుందని తెలిపారు. ప్రయాణ చార్జి సూపర్‌లగ్జరీ బస్సుకు టిక్కెట్ చార్జీ రూ.4,800, అల్ట్రా డీలక్స్ బస్సుకు టిక్కెట్ చార్జీ రూ.4,700గా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ ప్రత్యేక సర్వీసులకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్ ఆర్టీసీఆన్‌లైన్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లో ముందుగా సీట్లు రిజర్వేషన్ చేయించుకొనే సౌకర్యం ఉందన్నారు. అలాగే శ్రీకాకుళం బస్ స్టేషన్‌లో గల రిజర్వేషన్ కౌంటర్లో కూడా టిక్కెట్లు లభిస్తాయని చెప్పారు. వివరాలకు 70950 40608, 99592 25609 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ శ్రీకాకుళం ఒకటవ డిపో అసిస్టెంట్ మేనేజర్ వి.రమేష్ తదితరులు ఉన్నారు.

క్షయరోగులకు పౌష్టికాహార కిట్లు



పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జాతీయ క్షయ వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి టీబీ ముక్తా భారత్ అభియాన్ కింద ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం 40 మందికి పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేశారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బరాటం ముత్యాలమ్మ, ఇతర దాతల సహకారంతో ఈ కిట్లు సమకూర్చారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, కోఆర్డినేటర్ కె.సత్యనారాయణ, పి.చైతన్య, బి.చిన్మయరావు, బరాటం ముత్యాలమ్మ, ప్రకాష్, నరసింహమూర్తి కె.శ్యాంసుందర్, పవన్, మహేష్, ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రతిభకు ప్రశంసలు



కానిస్టేబుల్‌కు ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న సురేష్‌బాబు

శ్రీకాకుళం క్రైమ్ : పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, నిల్వలు చేస్తున్న వారిని పట్టుకోవడంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన హెడ్ కానిస్టేబుల్ జి.రామ్మోహన్‌ను శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా అమలు అధికారి ఎ.సురేష్‌బాబు తమ కార్యాలయంలో మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ప్రశంసాపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ కిరణ్‌కుమార్, ఐటీపీలు అప్పలనాయుడు, సింహాచలం, ఎస్ఐ అశోక్, చక్రవర్తి పాల్గొన్నారు.

కిరణ్‌చంద్ జీవితం స్ఫూర్తిదాయకం

కవిటి: తాను చనిపోతూ శరీరభాగాలను మరో ముగ్గురికి దానం చేసిన కిరణ్‌చంద్ జీవితం స్ఫూర్తిదాయకమని సోంపేట పట్టణంలోని కల్యాణీ పాఠశాల హెచ్ఎం బిందుమాధవి అన్నారు. కిరణ్‌చంద్‌కు సంతాప సూచికగా మంగళవారం మానవహారం చేపట్టి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబానికి సంతాపం తెలియజేస్తూ కవిటి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.



మానవహారంగా ఏర్పడి శ్రద్ధాంజలి ఘటించిన చిన్నారులు

వసతి దీవెనకు సర్వం సిద్ధం



- జిల్లాలో 50,895 మంది విద్యార్థులకు లబ్ధి
- నేడు 45,907 మంది తల్లుల ఖాతాల్లో రూ.47.85 కోట్లు జమ

శ్రీకాకుళం పాతబస్టాండ్: జగనన్న వసతి దీవెన పథకం నగదు విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో బుధవారం జమకానుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించి బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ, కాపు, మైనారిటీ, క్రిస్టియన్ మైనారిటీ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు సాయం అందించనున్నారు. జిల్లాలో 50,895 మంది విద్యార్థులకుగాను 45,907 మంది తల్లుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో రూ.47,85,85,000 జమచేయనున్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఈ మొత్తం జమ చేస్తారని జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ఆర్.గడ్డెమ్మ తెలిపారు. డిగ్రీ, పీజీ, అపై తరగతులు చదువుతున్న వారికి వార్షిక సంవత్సరంలో రూ.20 వేలు చొప్పున అందజేయనున్నారని చెప్పారు. ఈ విడతలో రూ.10 వేలను తల్లుల ఖాతాల్లో జమచేస్తున్నారని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు వార్షిక సంవత్సరంలో రూ.10 వేలు చెల్లించాల్సిండగా, తొలి విడతగా రూ.5 వేలు అందజేస్తున్నారని తెలిపారు. పాలిటెక్నిక్, ఇతర డిప్లమా విద్యార్థులకు ఏటా రూ.15 వేలకు గాను తొలి విడతగా రూ.7500 జమచేయనున్నారని చెప్పారు.

కేటగిరీ	విద్యార్థులు	తల్లులు	జమకానున్న నగదు
ఎస్సీ	3,755	3,448	రూ.3,50,85,000
ఎస్టీ	770	728	రూ.70,75,000
బీసీ	43,797	39,424	రూ.41,18,42,500
ఈబీసీ	1,696	1,558	రూ.16,24,500
మైనారిటీ	158	143	రూ.15,27,500
కాపు	700	666	రూ.66,25,000
క్రిస్టియన్	19	17	రూ.1,85,000
మొత్తం	50,895	45,907	రూ.47,85,85,000

పరిశుభ్రతతోనే మలేరియా నివారణ



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ మీనాక్షి

అరసవల్లి: దోమకాటుతోనే మలేరియా వస్తుందని, మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే మలేరియా వ్యాధి కారక దోమల వ్యాప్తిని నివారించవచ్చునని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి సూచించారు. ప్రపంచ మలేరియా నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు విద్యార్థులు చేపట్టిన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వణుకుతో కూడిన చలిజ్వరం లక్షణాలుంటే కచ్చితంగా మలేరియా పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పి.వి.సత్యనారాయణ, అదనపు డీఎంహెచ్ఓ డాక్టర్ అనూరాధ, జె.కృష్ణమోహన్, మలేరియా కన్సల్టెంట్ శ్రీకాంత్, డెమో వెంకటరమణ, సామాజిక కార్యకర్త మంత్రి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

100 బస్తాల గుట్కా పట్టివేత



గుట్కా బస్తాలను పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

టెక్కలి రూరల్: స్థానిక రోటరీనగర్–1లో ఏఎం టూ పీఎం రెస్టారెంట్ వెనుక భాగంలో హోటల్ సిబ్బంది ఉండే గదిలో సుమారు 100 బస్తాల గుట్కా, ఖైనీ, డీలక్స్, పాన్‌మసాలా బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు టెక్కలి ఎస్ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. గోపాలకృష్ణ సిబ్బంది ఉండే గదిలో ఎటువంటి బిల్లులు లేకుండా గుట్కాను నిల్వ ఉంచాడనే సమాచారం మేరకు సోదాలు నిర్వహించినట్లు చెప్పారు. వీటి విలువ రూ.2లక్షల70వేలు ఉంటుందని అంచనా వేశారు. పూర్తిస్థాయిలో బిల్లులు లేనందుల కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఆ గుట్కా వ్యాపారి మాత్రం తన వద్ద బిల్లులు ఉన్నాయని, పూర్తిస్థాయిలో ఖైనీలు, డీలక్స్‌లు అమ్ముకునే అర్హత తనకు ఉందని, త్వరలోనే షాపు ఓపెన్ చేస్తానని చెప్పడం గమనార్హం.

సచివాలయ ఉద్యోగులకు యూనిఫాం తప్పనిసరి



కొండములగాం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న వాసుదేవరావు

రణస్థలం: ప్రభుత్వం మూడు జతలు అందించినా కొందరు సచివాలయ ఉద్యోగులు యూనిఫాం ధరించకపోవడంపై డీఎల్‌డీవో, జిల్లా గ్రామ/వార్డు సచివాలయ నోడల్ అధికారి పి.వాసుదేవరావు అసహనం వ్యక్తం చేశారు. రణస్థలం–1, కొండములగాం గ్రామ సచివాలయాలను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఎస్‌డీసీ సర్వే సమగ్రంగా పూర్తి చేయాలని సూచించారు. ఆధార్ స్పెషల్ డ్రైవ్ విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఆగస్టు 31వరకు గడువు ఉందని నిర్లక్ష్యం చేస్తే చివరి రోజుల్లో పని ఒత్తిడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వి.ధనుంజయరావు, పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, లక్ష్మణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'పూర్వ ప్రాథమిక విద్య'లో ప్రవేశాలకు ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో పూర్వ విద్య బోధకులకు ఉపయోగపడే 'యర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్' కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ చెప్పారు. వర్సిటీ పరిపాలన కార్యాలయంలో మంగళవారం వివరాలు వెల్లడించారు. కోర్సు ఆన్‌లైన్‌లో ఉంటుందని పేర్కొన్నారు. 10వ తరగతి అర్హత గలవారు దరఖాస్తు చేసుకోవచ్చని, అంగన్‌వాడీ కార్యకర్తలకు సీట్ల కేటాయింపులో ప్రాధాన్యమిస్తామని తెలిపారు. మే15లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. బీఆర్ఏయూ.ఈడీయు.ఇన్ వెబ్‌సైటలో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. రూ.250 రిజిస్ట్రేషన్ ఫీజు డీడీని దరఖాస్తుకు జత చేయాలని సూచించారు.

సేవల్లో ప్రథమం

- రాష్ట్ర స్థాయిలో ఉత్తమ అవార్డుకు ఎంపికైన టెక్కలి డివిజన్ పశుసంవర్ధక శాఖ
- ఈ నెల 29న విజయవాడలో అవార్డు అందుకోనున్న అధికారులు
- అభినందించిన మంత్రి సీదిరి అప్పలరాజు



జేడీ కిషోర్, డీడీ జయరాజ్, అధికారులను అభినందిస్తున్న మంత్రి అప్పలరాజు

టెక్కలి: రాష్ట్ర వ్యాప్తంగా పాడి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు, అవగాహన కార్యక్రమాలను పాడి రైతులకు చేరువ చేసినందుకు టెక్కలి డివిజన్ పశు సంవర్ధక శాఖ రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి ఉత్తమ అవార్డుకు ఎంపికైంది. వ్యాధి నిర్ధారణ నమూనాల సేకరణ, వైఎస్సార్ సంచార పశు వైద్య సేవలు (1962), పశువులకు కృత్రిమ గర్భోత్పత్తి, పశుగ్రాస విత్తనాల పంపిణీ, సమీకృత మిశ్రమ దాణా, పశు విజ్ఞాన బడి, పశు చేయూత పథకం, పశు మత్స్యదర్శిని తదితర అంశాల్లో లక్ష్యానికి మించి సేవలు అందజేసినందుకు ఈ అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ జేడీ ఎం.కిషోర్, డీడీ వి.జయరాజ్‌తో పాటు డివిజన్ పరిధిలోని అధికారులకు రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు మంగళవారం అభినందించారు.

లక్ష్యానికి మించి సేవలు..

పాడి రైతుల సంక్షేమానికి ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఇందులో భాగంగా ప్రభుత్వం అందజేస్తున్న పశు సంవర్ధక సంక్షేమ కార్యక్రమాలను లక్ష్యానికి మించి అందజేసినందుకు టెక్కలి డివిజన్‌లోని టెక్కలి, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నందిగాం, పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కంచిలి, కవిటి, ఇచ్ఛాపురం, సోంపేట, పాతపట్నం, హిరమండలం, మెళియాపుట్టి, జలుమూరు, సారవకోట తదితర 16 మండలాల పరిధిలో ప్రథమ స్థానంలో ఉత్తమ అవార్డు లభించింది.

కార్యక్రమం	లక్ష్యం	చేరువైనవి
వ్యాధి నిర్ధారణ నమూనాల సేకరణ	7491	8303
వైఎస్సార్ పశు సంచార వైద్యం	868	2040
కృత్రిమ గర్భోత్పత్తి	93000	92,576
పశు చేయూత పథకం	5328	5227
మిశ్రమ దాణా పంపిణీ	350 (ఎంటీఎస్)	1460 (ఎంటీఎస్)
పశు విజ్ఞాన బడి	119	124
పశు, మత్స్యదర్శిని పుస్తకాలు	2000	1869

అందరి సహకారంతోనే..



టెక్కలి డివిజన్ పరిధిలో 16 మండలాల్లో పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న ఏడీలు, వీఏఎస్, పారా సిబ్బంది, పశు వైద్య సహాయకులు, గోపాలమిత్రలు, కార్యాలయాల సిబ్బంది సహకారంతో రాష్ట్ర స్థాయిలో టెక్కలి డివిజన్ పశు సంవర్ధక శాఖ ప్రథమ స్థానంలో నిలిచి ఉత్తమ అవార్డు సాధించాం. మంత్రి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు ఎంతగానో సహకరించారు. ఈ నెల 29న ప్రపంచ పశు వైద్యుల దినోత్సవం సందర్భంగా విజయవాడలో గోల్డ్ మెడల్ అందుకోనున్నాం.

– వి.జయరాజ్, పశు సంవర్ధక శాఖ, డీడీ, టెక్కలి